రీసెర్చ్ అసిస్టెంట్లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఉమెన్ బయోటెక్ ఇంక్యుబేషన్ ఫెసిలిటీలో తాత్కాలిక ప్రాతిపదికన పని చేయుటకు రీసెర్చ్ అసిస్టెంట్ పోస్ట్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు ఇంక్యుబేషన్ కేంద్రం సిఈఓ కళారాణి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవలసిందిగా సూచించారు. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీ వెబ్సైట్ ని చూడాలని ఆ ప్రకటనలో వెల్లడించారు.

విద్యుత్ ఛార్జీలను పెంచొద్దు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్/ పుత్తూరు టౌన్

'విద్యుత్ ఛార్జీలను నెలనెలా పెంచి వినియోగదారులపై మరింత భారం మోపొద్దు' అంటూ సిపిఎం ఆధ్వర్యంలో ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా జరిగింది. విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో ఆన్లైన్ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో ధర్నా ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం కోసమే ప్రభుత్వం ఆన్‌లైన్ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిందన్నారు. ఈ ఏడాదికి సంబంధించిన విద్యుత్ లోటు 14వేల కోట్లను ప్రజలపై భారం వేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించకుండా ఆహ్వానిస్తోందని, ప్రతినెలా ఛార్జీలను పెంచబోతుందని అన్నారు. ఈ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పంపుసెట్‌లకు మీటర్లు బిగించి ఉచిత విద్యుత్‌కు ఎసరు పెడుతున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్‌లోపు ఇస్తున్న ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని ఎత్తివేస్తున్నారని ఆరోపించారు. ఇళ్లకు బిగించే స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలపై భారాలు మోపితే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి సుబ్రమణ్యం, జి బాలసుబ్రమణ్యం, కే వేణు, పి మునిరాజా, పి బుజ్జి, ఎం నరేంద్ర, ఆర్ మల్లికార్జున రావు, ఏ రాధాకష్ణ, ముకుంద, అక్బర్, పద్మనాభం, పార్థసారధి రెడ్డి, మునిరామయ్య, ఎండి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద సిపిఎం ధర్నా

పవర్‌లూమ్ వర్కర్లకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి : సిఐటియు

మరమగ్గం కార్మికులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని సిఐటియు ఆధ్వర్యంలో పవర్‌లూమ్ వర్కర్లు ధర్నా నిర్వహించారు. పుత్తూరు విద్యుత్ శాఖ డిఇడి కార్యాలయం వద్ద ధర్నా ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకటేష్, పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎవెస్ పెరుమాళ్ మాట్లాడుతూ తమిళనాడులో 750 యూనిట్ల వరకు ప్రభుత్వం ఉచితంగా ఇస్తోందన్నారు. మన రాష్ట్రంలో కనీసం 500 యూనిట్లైనా ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరోనా కష్టకాలంలో పనులు లేక ఇబ్బందులు పడుతుంటే ఈడీ ఛార్జీ పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచిందన్నారు. ట్రూలప్ ఛార్జీల పేరుతో భారం మోపిందన్నారు. ఇప్పటికే పనులు లేక తమిళనాడు రాష్ట్రంలో వాచ్‌మెన్‌లుగా, హోటళ్లలో కూలి పనులకు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 60వేల మంది ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, నెలకు 500 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలని విన్నవించారు. పవర్‌లూమ్ పరిశ్రమను కేటగిరీ మూడు నుంచి నాలుగుగా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్రమణ్యం పిళ్లై, ఎంఎం షణ్ముగం, జగదీష్, పీకే వడివేలు, పాండియన్, వీరన్, మురగన్, త్యాగరాజన్, ఆర్ముగం, నాగప్ప పాల్గొన్నారు.

విద్యుత్ లోటును ప్రభుత్వమే భరించాలి

రేపు కమిషన్ ముందుకు సిపిఎం గళం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

విద్యుత్ లోటు రూ.12,702 కోట్ల రూపాయలను ప్రభుత్వమే భరించాలని, ప్రజల గోడు వినాలని, దొడ్డిదారిన భారాలు ఆపాలని సిపిఎం డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు శనివారం విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ముందు సిపిఎం జిల్లా నేత కందారపు మురళి పార్టీ గళాన్ని వినిపించనున్నారు. గత మూడేళ్లలో స్లాబుల మార్పుతో పేదలపై అధిక భారం పడిందని, కస్టమర్ ఛార్జీలు, ఫిక్స్ ఛార్జీలు, విద్యుత్ సుంకం, ట్రూఅప్, సర్‌ఛార్జీలు, పెనాల్టీలు, అదనపు లోడ్ డెవలప్‌మెంట్ ఛార్జీలు, అదనపు కన్స్యూమర్ డిపాజిట్లు ఇలా వివిధ రూపాలలో ప్రజలపై భారాలు పెంచారన్నారు. కొన్నిచోట్ల కనీస బిల్లు 26 రూపాయల 60 పైసలు వస్తే, మిగిలిన కొసరు ఛార్జీలు 180 రూపాయలు కలిపి 208 రూపాయల బిల్లు వచ్చిందని ఉదహరించనున్నారు. బిల్లు 12.5 శాతం ఉంటే, అదనపు ఛార్జీలు 87.5శాతం ఉందన్నారు. ఇళ్లకు అదనపు లోడ్ డెవలప్‌మెంట్ ఛార్జీలు వారం రోజుల్లో చెల్లించాలని పోర్షన్‌కు రూ.4,600 చొప్పున తాఖీదులు ఇచ్చారన్నారు. వాంబే కాలనీల్లో 30 గజాల ఇంటికి వెయ్యి రూపాయల బిల్లు వచ్చిందన్నారు. మరోవైపు విద్యుత్ బిల్లులు అధికంగా వచ్చాయని సంక్షేమ పథకాలు నిలిపేస్తున్నారని పేర్కొన్నారు. రెగ్యులేటరీ కమిషన్ విచారణలో ముఖ్యమంత్రి విస్పష్టమైన సమాధానాలు చెప్పి చిత్తశుద్ధిని రుజువు చేసుకోవాలన్నారు.

టిటిడిలో పటిష్టంగా విద్యుత్ ఆదా చర్యలు : ఈవో

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టిటిడిలో విద్యుత్‌ను ఆదా చేసేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఈవో ఎవి.ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలో గల కార్యాలయంలో ఎపిఎస్‌ఇసిఎం(ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్), నెడ్‌క్యాప్(నాన్ కన్వెన్షనల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఎపి) సంస్థల అధికారులతో గురువారం ఈవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ విద్యుత్ ఆదా చర్యల్లో భాగంగా అన్ని విభాగాల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నూతన పరికరాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఎపిఎస్‌ఇసిఎం సంస్థ టిటిడిలోని తాగునీటి పంపింగ్ స్టేషన్లలో గల 100 పాత పంపు సెట్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయనుందన్నారు. ఇందుకయ్యే ఖర్చును సదరు సంస్థ భరిస్తుందని చెప్పారు. తద్వారా విద్యుత్ ఆదా అవుతుందన్నారు. అదేవిధంగా, నెడ్‌క్యాప్ సంస్థ ఆధ్వర్యంలో టిటిడిలో అన్నప్రసాదాల తయారీకి సోలార్ స్టీమ్ కుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. ఈ విధానం ద్వారా వంటగ్యాస్ ఆదా అవుతుందన్నారు. ఈ మేరకు సదరు సంస్థల అధికారులతో టిటిడి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సమావేశంలో టిటిడి చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎపిఎస్‌ఇసిఎం సిఈవో చంద్రశేఖర్‌రెడ్డి, నెడ్‌క్యాప్ జనరల్ మేనేజర్ జగదీశ్వర్‌రెడ్డి, ఏరియా మేనేజర్ ఆంజినేయులురెడ్డి, ఎస్‌ఇ-2 జగదీశ్వర్ రెడ్డి, డిఇ రవిశంకర్‌రెడ్డి, వాటర్ వర్క్స్ ఇఇ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

'బర్డ్'లో మరింత మెరుగైన సౌకర్యాలు

ప్రజాశక్తి - తిరుపతి

బర్డు ఆస్పత్రిలో రోగులకు మరింత మెరుగైన సౌకర్యాలు, వైద్యసేవలు అందించేలా అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జెఇఒ సదాభార్గవి ఆదేశించారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలను గురువారం ఆమె పరిశీలించారు. ఆస్పత్రి వెనకా ముందు ప్రాంతాల్లో మొక్కలు పెంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. వాహనాల పార్కింగ్ క్రమపద్ధతిలో ఉండేలా చూడాలన్నారు. అత్యవసర వార్డు, జనరల్ వార్డు, ఎక్స్ రే, స్కానింగ్, ఓపి వార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, అన్న ప్రసాదాల నాణ్యత గురించి రోగులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆసుపత్రి కొత్త బ్లాక్ లో కేఫ్టేరియా, పాత బ్లాక్ వద్ద ఖాళీ స్థలంలో రోగులు వారి సహాయకుల కోసం క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జేఈవో సూచించారు. ఆసుపత్రి లోని కారిడార్లు, వార్డుల ఆవరణం అందంగా తయారు చేయడానికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఆసుపత్రిలో నిరుపయోగంగా ఉన్న సామగ్రి డిపిడబ్ల్యు స్టోర్ కు తరలించాలని ఆదేశించారు. కత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని పూర్తిస్థాయిలో అభివద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆమె సూచించారు. ప్రత్యేకాధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డెప్ప రెడ్డి, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్, సి ఎస్ ఆర్ ఎంవో డాక్టర్ కిషోర్ పాల్గొన్నారు.

22న కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రిలిమినరి పరీక్ష

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రిలిమినరి పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లను ఎస్పి పరమేశ్వరరెడ్డి పరిశీలించారు. ఆదివారం పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలు జరిగే కేంద్రాలను అధికారులతో కలిసి గీతం, లిటిల్ ఏంజిల్స్, జీవకోన విశ్వం స్కూళ్లను తనిఖీ చేశారు. ప్రతి కేంద్రంలో అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, మొబైల్ రీసివింగ్ కౌంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు సిసి కెమెరాలను అవసరమైన చోట ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. అడిషినల్ ఎస్పి కులశేఖర్, డిఎస్పిలు సురేంద్రరెడ్డి, ఈస్ట్ మురళీకృష్ణ, సిఐలు శివప్రసాద్‌రెడ్డి, అబ్బన్న పాల్గొన్నారు.

అందరివాడు' అంబేద్కర్

ఆలోచింపజేసిన 'సంఘం..శరణం..గచ్ఛామి'

రక్తి కట్టించిన ట్రిపుల్'ఏ' కళాకారులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి/నాయుడుపేట

అంబేద్కర్ కొందరివాడు కాదనీ.. అందరివాడని 'సంఘం..శరణం..గచ్ఛామి' నాటకం చాటి చెప్పింది. కుటిల రాజకీయాల్లో కుళ్లిపోతున్న అంబేద్కరిజానికి కొత్త భాష్యం చెబుతూ అనివర్గాల బాగు కోరిన సిసలైన అంబేద్కరున్ని ఈ నాటిక ఆవిష్కరించింది. తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణం ఎల్ఏ సాగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా గురువారం రాత్రి 'అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ' ఆధ్వర్యంలో సంఘం.. శరణం..గచ్ఛామి అంటూ భారత రాజ్యాంగ నిర్మాత, నిమ్న కులాల ఆశా జ్యోతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర, ఆశయాలు, లక్ష్యాలపై నాటక ప్రదర్శన ఇచ్చారు. అంబేద్కర్ ఎవరు? భారత జాతికి ఏం చేశారు? ఆయన ఆశయాలు, లక్ష్యాలు ఏంటి? అన్న అంశాలను స్పృశిస్తూ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ 2016 ఏప్రిల్ 14వ తేదీన చేపట్టిన ఈ మహా నాటక రూప ప్రదర్శన నాయుడుపేటకొచ్చేసరికి 508వ ప్రదర్శనకు చేరుకుంది. అంతకముందు బుధవారం రాత్రి సూళ్లూరు పేటలో నిర్వహించినది 507వ ప్రదర్శన కావడం గమనార్హం. ఇక నాటక ఇతివత్తంలోకి వెళితే..అంబేద్కర్ తన ఉన్నత చదువులకోసం భార్య రమా పుస్తెలను తాకట్టు పెట్టించే సంఘటన ఆలోచింపజేసింది. ఒక వైపు అనారోగ్యం బారినపడి మత్యువుతో పోరాడుతున్న కొడుకు..మరో వైపు భర్త ఉన్నత చదువు..! ఎవరికి పుస్తెలమ్మి డబ్బు ఖర్చుపెట్టాలన్న మీమాంసను దాటి రమా అంబేద్కర్ వైపు నిలిచే ఘట్టం హృద్యంగా నిలిచింది. చివరకు కొడుకు గంగాధర్ అనారోగ్యంతో మతి చెందడం, ఆ వార్త విని అంబేద్కర్ మరింత పట్టుదలగా చదువు కొనసాగించే దశ్యాన్ని ఆవిష్కరించిన తీరు ఆహూతులను ఉత్తేజపరిచింది. అనంతరం అంబేద్కర్ లండన్ లో ఉన్నత చదువులు పూర్తి చేసి దేశం తిరిగొచ్చాక మనువాదం, అంటరానితనం, వర్ణ వివక్షలపై పోరాడిన తీరును, చెరువులు, ఆలయ ప్రవేశాల కోసం దేశమంతా సాగిన సత్యాగ్రహ ఘట్టాలను ట్రిపుల్ ఏ కళాకారులు రక్తి కట్టించేలా ప్రదర్శించారు.

నిమ్న జాతులపై అనాదిగా సాగిన అన్యాయాలు, అణచివేతలపై ప్రపంచవేదికలపై బట్ట బయలు చేసిన విధానాన్ని నాటక రూపంలో బహిర్గతం చేశారు. నిమ్న జాతులకు రాజకీయ ప్రవేశం కల్పించాలన్న అంబేద్కర్ ప్రతిపాదనను మహాత్మా గాంధీ తోసిపుచ్చినప్పుడు ఆయన్ను సైతం వ్యతిరేకించి ఎదురొడ్డిన తీరును ఆవిష్కరించారు. అంతిమంగా కొందరు కుటిల రాజకీయ వాదులు సష్టించినట్లు అంబేద్కర్ అంటే భారత రాజ్యాంగ నిర్మాత, దళితుల ఆశాజ్యోతే కాదనీ, ఆయన అందరి వాడనీ, అన్ని వర్గాల మేలు కోరిన దార్శనికుడని చాటి చెప్పారు. నాయుడుపేట మున్సిపల్ చైర్మన్ కటకం దీపిక, కౌన్సిలర్లు దారా రవి, సుమా, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, మామిళ్లపాటి మహేష్, సీఐటీయూ నాయకులు శివకవి ముకుంద, మహేష్ బాబు, వెంకటేశ్వర్లు, పద్మావతి, చంద్రకళ, మధ్యాహ్న భోజన కమిటీ సభ్యులు విజయమ్మ, వాణి, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గూటికి మాజీ ఎమ్మెల్యే సత్రవాడ..!!

ఆయన వెంటే తనయుడు ప్రవీణ్
ఫలించిన బొజ్జల బృందమ్మ చర్చలు
త్వరలో ముహూర్తం ఖరారు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య, ఆయన తనయుడు ప్రవీణ్ టీడీపీ గూటికి చేరనున్నట్లు సమాచారం. మాజీ మంత్రి బొజ్జల గోపాలకష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ గురువారం సత్రవాడతో సుమారు రెండు గంటలకు పైగా మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. బొజ్జల, సత్రవాడ కుటుంబాల మధ్య జరిగిన చర్చలు ఫలించినట్లు తెలుస్తోంది. త్వరలో మునిరామయ్య, ప్రవీణ్ లు టీడీపీ లో చేరికకు ముహూర్తం ఖరారు చేయనున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి త్వరలో అధిష్టానంతో చర్చించి మునిరామయ్య చేరికకు ముహూర్తం ఖరారు చేస్తారని సమాచారం. సత్రవాడ మునిరామయ్య శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బలమైన వన్నెకుల (పల్లె రెడ్డి) సామాజిక వర్గానికి చెందిన వారు. ఈ కులానికి చెందిన వారు శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాల్లో అత్యధికంగా ఉన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా గెలుపు, ఓటమిని శాసించే స్థాయిలో ఈ సామాజిక వర్గం ఉంది. సత్రవాడ మునిరామయ్య 1985లో జరిగిన ఎన్నికల్లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. దాదాపు రెండన్నర ఏళ్ల పాటు శాసనసభ్యులుగా కొనసాగారు. ఆ తరువాత రాజకీయ సమీకరణాలు మారడంతో మునిరామయ్య కొంతకాలం పాటు క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. అయితే కొంతకాలం తరువాత కుమారుడు సత్రవాడ ప్రవీణ్ వైసీపీలో చేరడంతో మునిరామయ్య కూడా అదే పార్టీలో చేరారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి బియ్యపు మధుసూదనరెడ్డి విజయానికి ఎంతో కషి చేశారు. మునిరామయ్య కుటుంబం ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో చాలా సన్నిహితంగా ఉంటోంది. ఈ నేపథ్యంలోనే సత్రవాడ ప్రవీణ్ కు వైసీపీ రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి పదవితో పాటు చిత్తూరు పార్లమెంటు బూత్ కమిటీ ఇన్ ఛార్జి బాధ్యతలు అప్పగించారు. సత్రవాడ ప్రవీణ్ వైసీపీ కోసం ఎంతో క్రియాశీలకంగా పని చేశారు. అయితే ఏ కారణంగానో ఎన్నికల తరువాత శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి వీరి కుటుంబాన్ని పట్టించుకోవడం మానేశారు. మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్యను కానీ... ఆయన కుమారుడు సత్రవాడ ప్రవీణ్ ను కానీ పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదు. ఈ నేపథ్యంలో తీవ్ర అసంతప్తిలో ఉన్న మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య, ఆయన తనయులు సత్రవాడ ప్రవీణ్ ను గురువారం మంత్రి బొజ్జల గోపాలకష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ స్వయంగా వారి ఇంటికి వెళ్లి మాట్లాడారు. వీరి మధ్య దాదాపు రెండన్నర గంటలు చర్చలు జరిగాయి. తెలుగుదేశం పార్టీలో చేరితే సత్రవాడ ప్రవీణ్ కు మంచి ప్రాధాన్యత ఇస్తామని బొజ్జల బృందమ్మ హామీ ఇచ్చారు. సుదీర్ఘ చర్చల అనంతరం మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య, ఆయన తనయులు సత్రవాడ ప్రవీణ్ టీడీపీలో చేరేందుకు సానుకూలంగా స్పందించారు. ఈ విషయం ఇప్పుడు శ్రీకాళహస్తిలో హాట్ టాపిక్ గా మారింది. వీరి రాకతో శ్రీకాళహస్తిలో రాజకీయ సమీకరణాలు మారుతాయో లేదో చూడాలి మరి.

బొజ్జల బృందమ్మ మంతనాలు

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని 50 వార్డు సచివాలయాలలో ఖాళీగా ఉన్న 25 వాలంటీర్ల పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని అదనపు కమిషనర్ సునీత గురువారం ఒక ప్రకటనలో కోరారు. అర్హులైన వారు ఈ నెల 29వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి పాసై నివాసితుడై ఉండాలన్నారు. 50శాతం మహిళలకు కేటాయించనున్నట్లు తెలిపారు. రూలాఫ్‌రిజర్వేషన్ అమలవుతుంది. వాలంటీర్లకు ఐదువేల గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఏఆర్ పోలీసులూ అంతే ముఖ్యం : ఎస్పి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

సివిల్ పోలీసులతో పాటు ఏఆర్ పోలీసులూ అంతే ముఖ్యమైని ఎస్పి పరమేశ్వరరెడ్డి అన్నారు. తిరుపతి పోలీసు పెరెడ్ మైదానంలో 300 మంది సిబ్బందితో 15 రోజుల పాటు జరిగే ఎఆర్ మొబలైజేషన్ కార్యక్రమాన్ని ఎస్పి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడేందుకు సివిల్ విభాగానికి ఎఆర్ విభాగం తోడ్పాటును, సహాయ సహకారాలను అందిస్తోందన్నారు. ఏవైనా సందేహాలు, సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు కులశేఖర్, ఎఆర్ లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎంపిపివైతే నాకేంటి..?

మద్యం తాగి మహిళలపై ఎంపిటిసి దాడి
గొబ్బెమ్మల నిమజ్జనంలో వీరంగం
ఆనం, నేదురుమల్లి గ్రూపు విభేదాలేనా..?

ప్రజాశక్తి - బాలాయపల్లి

తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలం మన్నూరు గ్రామంలో మహిళలు గొబ్బెమ్మ నిమజ్జన పండగ కార్యక్రమంలో ఉండగా ఎంపిటిసి బట్టేపాటి మురళీమోహన్ రెడ్డి, ఆయన అనుచరులు ఫుల్లుగా మద్యం సేవించి వీరంగం సృష్టించారు. తనకు తెలియకుండా గ్రామంలో పండగ ఎలా చేస్తారంటూ మహిళలపై పరుష పదజాలంతో దాడి చేయడం గమనార్హం. అంతేకాకుండా 'ఎంపిపివైతే నాకు తెలియకుండా ఈ గ్రామానికి ఎలా వస్తావు? నీ అంతు చూస్తా' అంటూ ఎంపిపిపై దాడికి దిగేందుకు ప్రయత్నించారు. మీడియా కవరేజికి వెళ్లిన విలేకరులపై వీడియోలు తీస్తే 'మీ శవాలు ఊరు దాటిపోతాయి' అంటూ దాడికి యత్నించారు. పోలీసులకు ముందస్తుగా సమాచారం ఇచ్చినా, సంఘటనా స్థలానికి పోలీసులు ఆలస్యంగా వచ్చి ఎంపిటిసితో మంతనాలు జరపడం గమనార్హం. ఇటీవల తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆనం, నేదురుమల్లి మధ్య గ్రూపు విభేదాలే ఈ గొడవకు కారణమని తెలుస్తోంది. వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని మన్నూరులో బుధవారం గౌరీపూజ, బహుమతుల ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిపి గూడూరు భాస్కర్‌రెడ్డిని పిలిచారు. అయితే ఉప ఎంపిపి బట్టేపాటి మురళీ మోహన్‌రెడ్డి తన అనుచరులతో వచ్చి నువ్వు టిడిపి ఎంపిపివా, వైసిపి ఎంపిపివా? అంటూ వీరంగం సృష్టించి దాడికి యత్నించారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సంఘటనా స్థలానికి చేరుకుని సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు. ఎంపిపి కార్యక్రమం ముగించుకుని తిరిగి వెళ్లేటపుడు అడ్డుకుని 'నా గ్రామంలోకి ఎలా వస్తావు' అంటూ వివాదానికి దిగారు. దీంతో మాజీ ఎంపిపి, ప్రస్తుత ఎఎంసి సింగంశెట్టి భాస్కర్, ఎంపిపి గూడూరు భాస్కర్‌రెడ్డిల మధ్య గ్రూపులు బహిర్గతమయ్యాయి. ఎఎంసి ఆనం గ్రూపులో ఉండగా, ఎంపిపి నేదురుమల్లి గ్రూపులో ఉన్నారని తెలుస్తోంది.

పిచ్చిమొక్కలతో 'ఎస్‌ఎస్' కాల్వ

మూడేళ్లుగా ఒక్కపైసా విదిలిస్తే ఒట్టు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

వేల ఎకరాలకు సాగునీటితో పాటు రెండు నియోజకవర్గాల ప్రజల దాహార్తిని తీర్చే సోమశిల - స్వర్ణముఖి అనుసంధాన కాలువ నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరుకొంటోంది. నిధుల కేటాయింపులో జాప్యంతో ఆధునికీకరణ పనులు నిలిచి ఆయకట్టుదారులు ఇబ్బందులు పడుతున్నారు. అటు కాల్వ పనులు పూర్తికాక.. అటవీశాఖ అనుమతులు రాకపోవడంపై అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లుగా బడ్జెట్‌లో ఒక్కపైసా విదల్చకపోవడంతో ఎస్‌ఎస్ కాల్వ పిచ్చిమొక్కలతో అడవిని తలపిస్తోంది.

తిరుపతి జిల్లాలోని వెంకటగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాలకు సాగునీరు.. తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజవకర్గాల ప్రజలకు తాగునీరు అందించే సోమశిల-స్వర్ణముఖి అనుసంధాన కాల్వ పరిస్థితి దారుణంగా మారింది. 350 కోట్ల రూపాయల అంచనాలతో సోమశిల-స్వర్ణముఖి కాలువ నిర్మాణాలు ప్రారంభించి... దాదాపు 220 కోట్ల మేర ఖర్చుపెట్టి కొంత మేర నిర్మాణాలు పూర్తిచేసి నీటిని విడుదల చేశారు. కానీ గడచిన మూడేళ్లలో మిగిలిన పనులు పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయకపోగా...ఇప్పటికే పూర్తైన కాలువ నిర్వహణకూ నిధులు కేటాయించలేదు. ఫలితంగా కాలువ నిర్వహణ సరిగ్గా లేక పిచ్చిమొక్కలు పెరిగి వాటి నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతోంది.

జిల్లాలోని రాపూరు, డక్కలి, వెంకటగిరి, శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల్లోని లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా సోమశిల - స్వర్ణముఖికాలువ పనులు చేపట్టారు. ఈ కాలువ నుంచే పరిసర ప్రాంతాల జలాశయాలను నింపి 140 గ్రామాలకు తాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందించారు. సోమశిల - స్వర్ణముఖి కాలువ ఏర్పాటుకు అవసరమైన భూములు సేకరించినా....పరిహారం పంపిణీలో తీవ్ర ఆలస్యం అవుతోంది. ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల్లో పరిహారం అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాదయాత్ర సమయంలో కాలువ నిర్మాణాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన జగన్...మూడున్నరేళ్లు గడచినా ఎలాంటి పరిష్కారం చూపలేదని...కనీసం నిర్వహణకు నిధులు విడదల చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని మన్నవరం వద్ద అటవీ భూమికి సంబంధించి ప్రత్యామ్నాయంగా 19 ఎకరాల భూమిని బైరెడ్డిపల్లి మండలం కైగల్ గ్రామం వద్ద ప్రభుత్వం అటవీశాఖకు కేటాయించింది. ఈ భూములు స్వాధీనం చేసుకున్నా సాగునీటి శాఖ అధికారులు వాటిలో కాలువ నిర్మాణాలు మాత్రం చేయడం లేదు . ఫలితంగా కాలువ పనులు నిలిచిపోయాయి. రైతుల నుంచి సేకరించిన భూములకు పరిహారం చెల్లించడంతో పాటు....ఆగిపోయిన కాలువ నిర్మాణాలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

గిరిపుత్రులకు అందుబాటులో మౌలిక సదుపాయాలు



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ : మొక్కలచేను గ్రామంలో లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం, గహాల మరమ్మత్తు, విద్యుత్ దీపాల ఏర్పాటు, పలు అవసరాల కోసం ఉపయోగించుకునేందుకు వీలుగా కమ్యూనిటీ హాల్, నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేశారు. గురువారం సంస్థ కష్ణాజీ మౌలిక వసతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు ఏకం ఆశ్రమం చుట్టుపక్కలనున్న మండలాలలో దాదాపు 1000 గ్రామాలను దత్తత తీసుకోవడం జరిగిందని.. వాటిని ఆదర్శ గ్రామాలుగా తయారు చేయడమే తమ సంకల్పమన్నారు. ఇందులో భాగంగానే మొక్కలచేను గ్రామంలో పూర్తయిన పలు మౌలిక సదుపాయాల పనుల ప్రారంభోత్సవానికి రావడం జరిగిందన్నారు. మోడ్రన్ విలేజ్ గా ఉండాలనేదే శ్రీ అమ్మ భగవాన్ సంకల్పమని తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు సహకారం అందించిన అమెరికాలోని శ్రీ అమ్మ భగవాన్ మనవరాలు శ్రీకష్ణాజీ కుమార్తె శ్రీలోకా వీడియో కాల్‌లో మాట్లాడారు. గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామస్థులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

డిజిటల్ అసిస్టెంట్ కు ఆర్డీవో సన్మానం

ప్రజాశక్తి-దొరవారిసత్రం: దొరవారిసత్రం మండల పరిధిలోని కల్లూరు సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ మునిశేఖర్ ను గురువారం సూళ్లూరుపేట ఇన్‌ఛార్జి ఆర్డీవో కిరణ్ కుమార్ సన్మానించారు. ఆర్డీవో మాట్లాడుతూ కల్లూరు సచివాలయంలో 4,393 వివిధ సేవలు అందించి జిల్లాలో ప్రథమ స్థానంలో ఆదర్శంగా నిలిపినందుకు శాలువతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, ఎంపీడీవో బి.సింగయ్య, ఆర్.ఐ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు క్రీడలు అవసరం

ప్రజాశక్తి-బాలాయపల్లి: గ్రామీణ యువకులకు క్రీడలు అవసరమని జంపు సహకార సంఘం అధ్యక్షుడు వెందోటి కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం సంక్రాంతిని పురస్కరించుకొని జయంపు గ్రామంలో ఏబీఆర్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు జరిగాయి. విజేతలకు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైసీపీ నాయుకులు మల్లెల వెంకటేశ్వర్లు, వేమూరు వెంకటరమణరెడ్డి, క్రికెట్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

బలరామరెడ్డి సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం అభివద్ధికి మాజీ సిండికేట్ సభ్యులు మొక్కల బలరామరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య పి.కుసుమకుమారి కొనియాడారు. ఈ మేరకు వర్సిటీలోని ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో ఎస్వీయూ మాజీ ఉపకులపతి ఆచార్య పి.జయరామరెడ్డి నేతత్వంలో బలరామరెడ్డి 13వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆచార్య కుసుమకుమారి మాట్లాడుతూ బలరామిరెడ్డి 20 సంవత్సరాల పాటు ఎస్వీయూకు ఎనలేని సేవ చేశారని తెలిపారు. స్విమ్స్ డైరెక్టర్, ఉపకులపతి డాక్టర్ బి. వెంగమ్మ మాట్లాడుతూ బలరామ రెడ్డి స్విమ్స్ కు పాలకవర్గ సభ్యులుగా పనిచేశారని, స్విమ్స్ అభివృద్ధిలో ఎంతో పాలుపంచుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మహిళా వర్సిటీ మాజీ ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున, రచయిత పెమ్మరాజు గోపాలకష్ణ, సీనియర్ పాత్రికేయులు జి. శ్రీధర్, ఆచార్య పి. మునిరత్నం రెడ్డి, ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ పెంచల ప్రసాద్, భూమన్, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెట్ సిలిండర్లతో ప్రమాదాల నివారణ

ప్రజాశక్తి-నాయుడుపేట: గ్యాస్ ప్రమాదాలను నివారించడానికి కాంబో జెట్ ఫైబర్ సిలండర్లు 95 శాతం సురక్షితమైనవని నాయుడుపేట గ్యాస్ డీలర్లు తెలిపారు. కాంబో జెట్ సిలండర్లపై అవగాహన కల్పించేందుకు గురువారం నాయుడుపేటలోని సత్యసాయిబాబా మందిరంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో నాయుడుపేట ఇండియన్ గ్యాస్ డీలర్లు కమల గ్యాస్ ఏజన్సీ లీలచంద్రరెడ్డి, లక్ష్మీకాంతమ్మ ఏజన్సీ శ్రీనాథ్‌రెడ్డి లు మాట్లాడుతూ క్రమం తప్పకుండా సమయానికి గ్యాస్ డెలివరీ బాయ్స్‌చే గ్యాస్ పైపులు, రెగ్యులేటర్లను చెక్ చేయించుకుని వారి సూచనల మేరకు అవసరమైతే మార్చుకోవాలన్నారు. ఏదైనా నష్టం కలిగితే సిలండర్లపై ఉన్న ఇన్సూరెన్స్ సాయం అందుతుందని తెలిపారు.

చిన్నారులలకు మెనూ మేరకు పౌష్టికాహారం

ప్రజాశక్తి- పిచ్చాటూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు మెనూ పేరకు పౌష్టికాహారం అందించాలని తిరుపతి జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ డైరెక్టర్ జయలక్ష్మి సూచించారు. గురువారం ఆమె వేలూరు, కుప్పంకండ్రిగ, కీళపూడి , పిచ్చాటూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీడీపీవో శోభారాణి, సూపర్‌వైజర్లు మారియమ్మ, బేబీ, కల్పలత పాల్గొన్నారు.

విశ్వదాభిరామ.. వినురవేమ..!

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లెవెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రజాకవి వేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు అరసం యువశ్రీ మురళీ మాట్లాడుతూ అక్షరాలు జోడించి జీవిత తత్వాన్ని, జీవిత సత్యాలను, అనుభవాలను కాచి, వడపోసిన తెలుగు మహాకవులలో ప్రజాకవిగా వేమన నిలిచారని తెలిపారు. ఆయన రాసిన వేమన శతకంలోని పద్యాలు వ్యక్తిత్వ వికాసానికి దర్పణాలని, మంచి.. చెడు,

ఘనంగా విశ్వకవి వేమన జయంతి

మానవ విలువలు, నీతి కనపడుతాయన్నారు. విశ్వదాభిరామ.. వినురవేమ అనే మకుటంతో విశ్వవ్యాపితమైన వేమన పద్యాలు ఎప్పుడు చదివినా కొత్తదనంగా. ఇంకా చదవాలనేలా.. తెలుసుకోవాలనే జిజ్ఞాస కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయసుధ, వాణి, రామక్క, మాధవీలత, ఒబ్బుదేవి ప్రసాద్, వేణుగోపాల్, నాదెండ్ల మురళి, సురేష్ బాబు, మోహన్ బాబు, దాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేమన పద్యాలు నీతికి నెలవులు

నాగలాపురం: మండలంలోని ఎస్.ఎస్.పురం పాఠశాలలో గురువారం వేమన జయంతి వేడుకలు ఘనంగా

నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన శతకాలు 50కి పైగా పద్యాలను విద్యార్థులు పఠించి భావాలు వివరించారు. విద్యార్థులు ప్రదర్శనలు చేపట్టారు. ప్రధానోపాధ్యాయులు ఉదయచంద్రిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేణిగుంట: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలురు, బాలికల పాఠశాలలు, కరకంబాడిలోని తారకరామనగర్ హైస్కూల్లో గురువారం ఘనంగా వేమన జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి కన్వీనర్ వెంకట రమణ, ఉపాధ్యాయులు నర్సింహులు, ఉమామహేశ్వరి, రమాదేవి, శ్రీదేవి, ప్రసాద్, శ్రీరాములు, కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉగాదిలోపు జగనన్న కాలనీల్లో గృహ ప్రవేశాలు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: జిల్లాలో రీసర్వే వేగవంతం చేయాలని, జాతీయ రహదారులకు భూసేకరణ, గహ నిర్మాణాలు వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి డా. జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం సాయంత్రం రీ సర్వే, ఇంటి స్థలాలు, హౌసింగ్, వ్యవసాయ అనుబంధ శాఖలు, గ్రామ వార్డు సచివాలయం వ్యవస్థ, గడప గడపకు మన ప్రభుత్వం తదితర అంశాలపై రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సంబంధిత కార్యదర్శులతో అమరావతి నుంచి వర్చువల్ విధానంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకట రమణారెడ్డి, సంబంధిత జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశమై జిల్లాలో చేపడుతున్న భుహక్కు.. భూరక్ష రీసర్వే లో గ్రౌండ్ వ్యాలిడేషన్, డీఎల్ఆర్ పబ్లిష్ చేయడం హక్కు పత్రాలు అందజేయడం వంటివి ఫిబ్రవరి నాటికి సకాలంలో పూర్తి చేయాలన్నారు. స్పందన అర్జీలను సకాలంలో స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖ కు సంబంధించి రబీ వరి పంటకు ఈ క్రాపింగ్ పూర్తి చేయాలని, వరి ధాన్యం కొనుగోలుకు పౌర సరఫరాల సంస్థ సన్నద్ధం కావాలన్నారు. సూపర్ చెక్ ఆన్‌లైన్ లో అందుబాటులోకి వచ్చిందని తహసీల్దార్లు, ఆర్డీవోలు, అగ్రికల్చర్ అధికారులు తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రతి శనివారం హౌసింగ్ డే గా జిల్లాలో అన్ని మండలాల్లో సంబంధిత అధికారులు లేఔట్ ల సందర్శన, గహ నిర్మాణ పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సచివాలయ పరిధిలో అందిన 1589 పనులలో అత్యంత ప్రాధాన్యత పనులు 1483 కు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. వివిధ దశలలో ఉన్న పనులను వేగవంతం చేయాలని, ఎప్పటికప్పుడు బిల్లులను ఆన్లైన్లో అప్లోడ్ చేయాలన్నారు.

కార్యక్రమంలో డీఆర్‌వో శ్రీనివాసరావు, డీఎల్‌డీవో సుశీల దేవి, సీపీవో అశోక్ కుమార్, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా సర్వే అధికారి జయరాజ్ , ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుహానా సోని , హౌసింగ్ ఈఈ చంద్రశేఖర్‌బాబు, మత్స్యశాఖ అధికారి చాంద్‌బాషా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో ఆధార్ సేవలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ప్రభుత్వం ప్రత్యేకంగా ఆధార్ శిబిరాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుందని.. గ్రామ సచివాలయాలు, పాఠశాలల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నామని ఎంపీడీవో ఇందిరమ్మ అన్నారు. గురువారం పుత్తూరు మండలంలోని రామకృష్ణాపురం సచివాలయంలో అందిస్తున్న ఆధార్ సేవలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మొదటి విడతగా ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు, రెండో విడతగా ఫిబ్రవరి 7 నుంచి 10వ తేదీ వరకు ఆధార్ బయోమెట్రిక్ అప్డేషన్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని.. ప్రతిఒక్కరూ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ విరిత, ఈవోపీఆర్డీ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి మునినరేష్‌కుమార్, వైఎస్ఆర్‌సీపీ నాయకుడు దేవేంద్రరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు: పదేళ్లుగా ఆధార్, బయోమెట్రిక్ అప్డేషన్ చేసుకోని వారికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఆధార్ శిబిరాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుందని.. గ్రామ సచివాలయాలల్లో సేవలు అందిస్తున్నామని ఎంపీడీవో దేవేంద్రబాబు అన్నారు. గురువారం మండలంలోని నెల్లుట్లవారిపల్లె సచివాలయంలో అందిస్తున్న ఆధార్ సేవలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ



మదనమోహనరాజు, డిజిటల్ అసిస్టెంట్లు తూపల్లి వెంకటేశ్వరెడ్డి, పద్మజ, కార్యదర్శి సతీష్, కుమార్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో త్రివిక్రమరావు ఆధ్వర్యంలో ఆధార్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా ఆధార్ బయోమెట్రిక్ అప్డేషన్ చేసుకోని వారికి ప్రభుత్వం ప్రత్యేకంగా క్యాంపులు నిర్వహించాలని సంకల్పించిందన్నారు. బుచ్చినాయుడుకండ్రిగ గ్రామ సచివాలయంలో తొలిరోజు క్యాంపును పరిశీలించారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్లు మునికుమార్, మహిళా పోలీస్ కాంచన, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతివాసి కోడికి 'బెస్ట్ కాక్' అవార్డు ప్రదానం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : సంక్రాంతి వేడుకలు పురస్కరించుకొని తమిళనాడులోని పళ్లిపట్టు సమీపం ఆర్కే పేటలో మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజులు పాటు కోడిపందెం పోటీలు నిర్వహించారు. తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి వివిధ జాతులకు చెందిన కోళ్లు పోటీల్లో పాల్గొన్నాయి. మూడు రోజులు పాటు నిర్వహించిన పోటీల్లో 386 పందెం కోళ్ళు పోటీపడ్డాయి. అందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సర్కిల్లో రెఫరీల సమక్షంలో పోటీల్లో నిర్వహించారు. గురువారం సాయంత్రం బహుమతులు ప్రదానం చేయు కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ తిరుపతి నామాలు వారి పార్టీకి చెందిన విజయ్ అనే వ్యక్తి కోడి 50

సెకండ్లలో విజయం సాధించడంతో ఆ కోడికి బెస్ట్ కాక్ అవార్డు ప్రదానం చేశారు. అదేవిధంగా గెలుపొందిన కోడిపుంజులకు పోటీ నిర్వహకులు బహుమతులతో సత్కరించారు.

ఎమ్మెల్యేలను బలోపేతం చేయడానికే : బాలినేని

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చాలా మంచిదని, ప్రజల సమస్య లను తెలుసుకొని, పరిష్కరించి, తద్వారా ఎమ్మెల్యే లు మరింత బలోపేతం అవుతారని మాజీ మంత్రి, పార్టీ ప్రాంతీయ సమన్వయ కర్త ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం తిరుపతి లో పార్టీ జిల్లా సమావేశం జరిగింది. బాలినేని మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పార్టీ ని విజయ తీరాలకు చేర్చాల్సిన బాధ్యత పార్టీ గహ సారదులు, కన్వీనర్ ల పై ఉందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి మంచి పాలన ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు అందించి పేదల కష్టాలు తీరుస్తున్నారని పేర్కొన్నారు. ఇటువంటి

మంచి సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిని మరలా సిఎంను చేయాలన్నారు. ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు.

బి-ఫార్మసీ కోర్సుల్లో అడ్మిషన్లు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఈనెల 24వ తేదీన బీఫార్మసీ కోర్సుల్లో ఖాళీగా ఉన్నటువంటి సీట్లను భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు ఫార్మసీ విభాగాధిపతి ఆచార్య బి. శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ లో బై పిసి కోర్సు చదివిన విద్యార్థినులు (మహిళా అభ్యర్థులు) తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతొ పాటు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తీసుకొని జనవరి 24 వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 11.00 గంటల వరకూ యూనివర్సిటీ ఫార్మసీ విభాగంలో హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు మహిళా వర్సిటీ వెబ్ సైట్ ను సంప్రదించాలని సూచించారు. ఎంపిక కాబడిన విద్యార్థినులు 17,834 రూపాయలు ఫీజు అదే రోజు చెల్లించాలని, స్పాట్ ద్వారా చేరిన విద్యార్థినులకు ఫీజు రేయింబర్సుమెంట్ వర్తించదని తెలిపారు.

అణచివేత ధోరణి మానుకోండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న బిసి నాయకత్వాలపై జగన్ ప్రభుత్వం అణచివేత ధోరణిని మానుకోవాలని తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. 'అందితే జుట్టు– లేకపోతే కాళ్ళు' అన్న చందాన వైసిపి అధినేత జగన్ రెడ్డి వ్యవహారం ఉందని విమర్శించారు.

'జల్లికట్టు'నిర్వాహకులపై 31 కేసులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : జల్లికట్టు నిర్వహణపై పోలీసుల ఆంక్షలు ఉన్నప్పటికీ నిర్వాహకులు వాటిని లెక్కచేయకుండా పోటీలను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ క్రమంలోనే జల్లికట్టు నిర్వాహకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎ.రంగంపేట జల్లికట్టు నిర్వాహించిన 10 మందిపై కేసు నమోదైంది. ఇక, జిల్లాలో మొత్తం 31 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇక, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో స్థానికంగా పశువుల పండుగగా పిలుచుకునే జల్లికట్టు తరహా పోటీలకు దాదాపు 150 ఏళ్ల చరిత్ర ఉంది. ప్రతి ఏటా సంక్రాంతి సందర్భంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. కనుమ పండగ సందర్భంగా రంగంపేటలో నిర్వహించిన జల్లికట్టు పోటీలను చూసేందుకు పొరుగు జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. జల్లికట్టు పోటీలో పాలుపంచుకున్న యువత.. ఇరుకైన దారిలోకి వదిలిన పశువుల కొమ్ములకు కట్టిన పలకలను దక్కించుకునేందుకు పోటీ పడ్డారు. ఈ ఘటనలో దాదాపు 10 మంది యువకులు గాయపడ్డారు. జల్లికట్టు పోటీలకు కొన్ని రోజుల ముందే పోలీసులు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. జల్లికట్టు సహా ఆ రకమైన క్రీడల నిర్వహణకు ఎటువంటి అనుమతి లేదని పోలీసుల ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

అప్రమత్తతే ప్రాణాలకు భద్రత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అప్రమత్తతే ప్రాణాలకు భద్రతని జిల్లా రవాణా అధికారి సీతారామరెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ రహదారి నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాలు లేని సమాజ నిర్మాణానికి దోహదపడాలని పిలుపునిచ్చారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక సీసీఎన్ కన్వెన్షన్ హాలులో శ్రీకాళహస్తి రవాణా శాఖ ఆధ్వర్యంలో "యువశక్తి ద్వారా సామాజిక మార్పు" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా రవాణా అధికారి సీతారామరెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో మన దేశం ప్రపంచ దేశాల జాబితాలో మొదటి స్థానంలో ఉండడం దురదష్టకరమన్నారు. మనదేశంలో నిముషానికి సగటున నాలుగు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయనీ, ఏటా సుమారు రెండు లక్షల మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక శాతం రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని నిపుణుల అధ్యయనంలో తేలిందని చెప్పారు. ముఖ్యంగా వాహన చోదకులకు రహదారి నియమాలపై అవగాహన లేకపోవడం వల్లే ప్రమాదాలకు కారణమవుతోందని అన్నారు. శ్రీకాళహస్తి డిఎస్పి విశ్వనాథ్, ఆర్టీసీ డిఎం హర్షవర్ధన్ రెడ్డి, ట్రాఫిక్ సిఐ వెంకటప్ప, ఎంవిఐ దామోదర్ నాయుడు, రహదారుల భద్రతా ఇంజనీర్ రాథోడ్, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE: PUTTUR
I.A.No. 157 of 2022
A.S.No. 6 of 2022
Between
Thangella Munemma & Others
...Petitioner/Appellants
And
Puttur Rupamma & Others
...Respondents/Respondents
SUMMONS TO THE RESPONDENT(3) / DEFENDANT(6)
To
THANGELLA VENKATRARAMANAREDDY,
S/o Late Subramanyam Reddy,
Hindu,aged about 45 years,
D.No.8-253/2,Sathyanarayana Puram,
Rajeev Nagar Panchayat,Tirupati North Post, TIrupati Urban Mandal,Chittoor Dist,AP
Sir, Please take notice that the above named Appellant filed the above Appeal against the order passed in O.S.No.135 of 2011 on the file of PJCJ of Puttur and said appeal is posted to 25.01.2023 for your appearance. Hence your directed appear before above said court on 25.01.2023 at about 10-30 A.M either in person or through an advocate and file your objections if any.
Sd/- K.JANAKIRAMA REDDY,
P.N.ANBALAGAN, Advocates,
Chittoor, Puttur, Cell : 94409 94909

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, శ్రీకాళహస్తి
O.S.No. 14/2013
Between:
ఎమ్.రామచంద్రయ్య. ...వాది
AND
సి.గురునాథం మరియు ఇతరులు ...ప్రతివాది
దావా సమన్లు
To,
D4: సి.లక్ష్మిప్రసాద్, S/o లేట్ సి.గురునాథం, R/o పాపానాయుడుపేట, ఎర్పడు మండలం, తిరుపతి జిల్లా.
పై దావాలో 4వ ప్రతివాది అయిన మీకు కోర్టు వారు దావా సమన్లు, సబ్‌స్టిట్యూట్ సర్వీస్ ద్వారా ఆర్డరు చేసియున్నారు. సదరు దావాలో 02.02.2023వ తేదీన 4వ ప్రతివాది అయిన మీరు ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో నేరుగా గానీ, మీ వకీలు ద్వారా గానీ హాజరు అయి తమ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనంతట పై దావా మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.
వాయిదా తేది: 02.02.2023.
జి.శేఖర్, M.A.,B.L.,
వి.చేతన్‌కుమార్ రెడ్డి, B.B.A., LLB.,
అడ్వకేట్స్,
శ్రీకాళహస్తి.

జనరల్ న్యూస్

అదుపు తప్పిన లారీ.. డ్రైవర్‌కు తీవ్రగాయాలు

ప్రజాశక్తి-తడ: మండలంలోని పులివేంద్ర గ్రామం సమీపంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ వద్ద జాతీయ రహదారిపై చెన్నై నుంచి నెల్లూరు వైపు కార్లు తీసుకువెళ్తున్న లారీ ప్రమాదానికి గురైంది. ముందు వెళుతున్న లారీని అధికమించే సమయంలో ముందు వెళుతున్న లారీ హఠాత్తుగా బ్రేక్ వేయడంతో దానిని ఢీకొని డివైడర్‌పైకి వెళ్లి ఆగింది. ప్రమాదంలో లారీలోని రెండో డ్రైవర్ ఇంతియాజ్ ఖాన్ (45) తీవ్రంగా గాయపడ్డాడు. తడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సాయంతో లారీ ముందు భాగాన్ని లాగించి అతడిని బయటకు తీసి ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎంఎల్‌పీరెడ్డికి అంతర్జాతీయ గుర్తింపు

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతికి చెందిన డాక్టర్ ఎంఎల్ పీ రెడ్డికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. అంతర్జాతీయ అడ్వాన్స్ మెటీరియల్ అసోసియేషన్ డాక్టర్ ఎంఎల్ పీ రెడ్డిని ఫెలోగా ప్రకటించి గౌరవించింది. డాక్టర్ ఎంఎల్ పీ రెడ్డి పరిశోధనా కషికి ఈ గుర్తింపు.. గౌరవం లభించాయి. డాక్టర్ ఎంఎల్ పీ రెడ్డి, గతంలో ఎస్వీ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగంలో పీజీ, పిహెచ్.డీ పూర్తి చేశారు. వివిధ జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. వీరు రూపొందించిన 250 పరిశోధనా పత్రాలు ప్రముఖ జర్నల్స్ లో ప్రచురితమయ్యాయి. పలు పుస్తకాలు కూడా రాశారు. ప్రస్తుతం తిరుపతి రూరల్ తుమ్మలగుంట లో నివాసం ఉంటున్నారు. రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ అడ్వాన్స్ మెటీరియల్ అసోసియేషన్ ఫెలోగా గౌరవాన్ని పొందారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎంఎల్ పీ రెడ్డిని ఎస్వీయూ ఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు, అభినందించారు. మన ప్రాంతానికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎల్ పీ రెడ్డి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు, గౌరవం పొందడం గర్వకారణమని పేర్కొన్నారు.

21 నుంచి పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి - తిరుపతి(మంగళం): ఎన్నో ఏళ్లుగా భారతీయ చరిత్ర, సాహిత్యం, పౌరాణిక, వైజ్ఞానిక, మనోవైజ్ఞానిక, న్యాయ ఇలా అనేక రంగాలకు సంబంధించిన పుస్తకాలను ప్రజలకు అందిస్తూ భారతీయ విద్యా భవన్ అరుదైన ఖ్యాతిని సొంతం చేసుకుందని భారతీయ విద్యా భవన్ సంచాలకులు, కోశాధికారి డాక్టర్ నడింపల్లి సత్యనారాయణ రాజు తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 21 నుండి 29వ తేదీ వరకు తిరుపతి నగర పరిధిలోని వినాయక నగర్ క్వార్టర్స్ క్రీడా మైదానంలో భారతీయ విద్యా భవన్ 15వ పుస్తక ప్రదర్శనను నిర్వహిస్తోందన్నారు. ఈ ప్రదర్శనలో దాదాపుగా 64 పఠనోపయోగ్యంగా 24 స్టాల్స్ ను పుస్తక ప్రియుల కోసం అందుబాటులో ఉంచుతామన్నారు. పుస్తక ప్రదర్శన జరిగే రోజుల్లో ప్రత్యేకతను చాటుకోవడానికి ఒక్కో రోజు ఒక్కో అంశాన్ని తీసుకొని సాయంత్రం 6:30 నుండి 7 గంటల ముప్పై నిమిషాల వరకు ముఖ్య అతిథులచే కార్యక్రమాలను నిర్వహించేలా ప్రణాళికలు చేశామన్నారు. భారతీయ విద్యా భవన్ తిరుపతి వారి ఆధ్వర్యంలో జరిగే 15వ పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని బెంగళూరుకు చెందిన మనసు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మన్నం వెంకటరాయుడు, తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి, తిరుపతి జిల్లా కలెక్టర్ కె వెంకటరమణ రెడ్డి, భారతీయ విద్యా భవన్ వైస్ చైర్మన్, ఐఐటి తిరుపతి సంచాలకులు కే ఎన్ సత్యనారాయణ పాల్గొంటారన్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం ఒంటిగంట నుండి రాత్రి 9 గంటల వరకు పుస్తక ప్రదర్శనను నడుపుతామన్నారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శనకు సంబంధించి పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ విద్యాభవన్ కార్యదర్శి సుధాకర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వరరావు దక్షిణామూర్తి పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం పూర్తవ్వాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఇండోర్ స్టేడియం పనులు మార్చి లోపల పూర్తి చేసి నగర ప్రజలకు ఏప్రిల్‌కల్లా అందుబాటులోకి తీసుకురావాలని మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అధికారులను, ఏయికామ్ ప్రతినిధులను, కాంటాక్టర్లను ఆదేశించారు. నగరపాల సంస్థ పరిధిలోని ఇందిరా మైదానం వద్ద నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులను గురువారం మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి సంయుక్తంగా పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులు మార్చి లోపల పూర్తి చేసి ఏప్రిల్ నెలలో నగర ప్రజలకి అందుబాటులోకి తీసుకోవచ్చే విధంగా ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. కమీషనర్ మాట్లాడుతూ ఈ స్టేడియంలో షటిల్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, జిమ్ ఏర్పాట్లు చేస్తున్నామని, క్రీడాకారులకు అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. మేయర్‌తో పాటు కమిషనర్ అనుపమ అంజలి, స్మార్ట్ సిటీ డి. ఈ మోహన్, ఏయికామ్ ప్రతినిధులు బాలాజీ, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గూడూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
S.O.P.No. 224/2022
మొచెర్ల ప్రసాద్, S/o లేట్ మస్తానయ్య, మొచెర్ల కోటయ్య, S/o లేట్ మస్తానయ్య, అశోక్‌నగర్, గూడూరు, తిరుపతి జిల్లా. ...పిటిషనర్
Vs
ది కమీషనర్, ఎంప్లయ్స్ ప్రావిడెంట్ పండ్ ఆర్గనైజేషన్, రీజనల్ ఆఫీస్, కడప, వైఎస్ఆర్ కడప జిల్లా.
...రెస్పాండెంట్
పిటిషనర్ మొచెర్ల ప్రసాద్, మొచెర్ల కోటయ్య, S/o లేట్ మస్తానయ్య, లేట్ మొచెర్ల రాజేశ్వరి, D/o లేట్ మస్తానయ్య, (అవివాహిత), ఈమె గోగినేనిపురం నందు మైకాఫ్యాబ్ కంపెనీ నందు పనిచేస్తుంది. ఈమె 28.11.2021న చనిపోయినది. సదరు మొచెర్ల రాజేశ్వరికి తమ్ముల్లు అయినటువంటి మొచర్ల ప్రసాద్, కోటయ్యకు రెస్పాండెంట్ నుంచి రావలసిన బెనిఫిట్స్ కొరకు పై కోర్టులో వారసత్వపు పిటీషన్ దాఖలు చేసివున్నారు. దాని నిమిత్తమై కోర్టువారు రెస్పాండెంట్‌కు కోర్టుకు హాజరు కావలసినదిగా నోటీసు జారీ చేస్తున్నారు. ఇందు నిమిత్తము 31-1-2023 ఉదయం 10.30 గంటలకు పైకోర్టులో హాజరై ఎటువంటి ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలసినది. లేనిచో మీ పరోక్షమున పై కేసును తీర్మానించెదరు.
వాయిదా తేది: 31-1-2023.
//కోర్టు వారి ఆర్డర్ ప్రకారము//
టి.వి.రమణయ్య, B.A.,B.L.,
పి.ప్రతాప్‌కుమార్, M.A.,L.L.B.,
అడ్వకేట్స్, గూడూరు.
సెల్: 9030935777.